ముమ్మూర్తుల శక్తి.. మూగజీవులకు ముక్తి

శివుడిని పూజిస్తున్న మూగజీవాలు



శ్రీకాళహస్తీశ్వరాలయం దేశంలోని మిగిలిన శైవాలయాలతో పోలిస్తే ఒకింత భిన్నం. మూగజీవులైన (శ్రీ–కాళ–హస్తులకు) సాలీడు..సర్పరాజం.. ఏనుగు భక్తికి మెచ్చి.. ఆ మూడు జీవులకు శివసాయుజ్యం ప్రసాదించిన ముక్తి ప్రదాత. అందుకే ఇది సద్యోముక్తి క్షేత్రంగా(అడుగిడిన వెంటనే ముక్తిని ప్రసాదించే), భక్తుల పాలిట దక్షిణ కైలాసంగా ఖ్యాతి గాంచింది. అందుకే ఇక్కడ స్వామి బ్రహ్మోత్సవాలంటే ముల్లోకాలకు పండుగే. నేటి నుంచి శివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ పుణ్యక్షేత్రంపై ప్రత్యేక కథనం. – శ్రీకాళహస్తి



ఆలయంలో విద్యుద్దీపాలంకరణ



దేవతామూర్తుల విద్యుత్ కటౌట్లు



మూగజీవులకు ముక్తి నిచ్చిన భూతల కైలాసంగా శ్రీకాళహస్తి క్షేత్రం ఖ్యాతి గాంచింది. ఈ వాయులింగేశ్వర క్షేత్రం మహాశివరాత్రికి సన్నద్ధమైంది. దేవస్థానం భక్తుల కోసం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. మూగజీవాలకు ముక్తితో శ్రీకాళహస్తి అనే పేరు సార్థకమైంది. కృతయుగంలో సాలెపురుగు (శ్రీ), పాము (కాళ), ఏనుగు (హస్తి)ఒకదానికి తెలియకుండా ఒకటి శివుడ్ని నిత్యం పూజించేవి. శివలింగాన్ని ఎండ వానల నుంచి రక్షించేందుకు సాలె పురుగు గూడు అల్లి పూజించేది. పాము రత్నాలు, ముత్యాలతో.. ఏనుగు తొండంతో నీరు తెచ్చి అభిషేకం చేసి ఫల, పుష్ప, పత్రాలు పెట్టి పూజించేది. అయితే ఎవరో శివుడికి హాని చేసే కార్యక్రమం తలపెడుతున్నారని వేటికవి భయపడుతాయి. ఏనుగుని సంహరించాలని పాము తొండంలో దూరి బాధపెడుతుంది. ఆ బాధను భరించలేక తొండాన్ని బండకు ఢీ కొట్టి ఏనుగు మరణిస్తుంది. ఏనుగు తొండంలో ఉన్న పాము కూడా మృతి చెందుతుంది. శివలింగానికి పైన ఉన్న సాలెపురుగు కూడా మరణిస్తుంది. శివుడు ఈ మూడింటికి ముక్తిని ప్రసాదిస్తాడు. శివైక్యం పొందిన వాటి రూపంలోనే శివలింగం మొత్తం సర్ప శరీరంగా దర్శనమిస్తోంది. పైనుంచి కింది వరకు ఏనుగు దంతాలు, అడుగు భాగంలో సాలెపురుగు ఆకారాన్ని పోలి ఉంటుంది. ఏనుగు దంతాల మధ్యలో భక్తుడైన కన్నప్ప కన్ను కనిపిస్తుంది. అందుకే ఈ క్షేత్రం శ్రీ,కాళహస్తిగా పేరు గాంచింది.

పల్లవించెను నాడు.. పరిమళించేను నేడు

దేశంలో ఎక్కడా లేని విధంగా శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని నిర్మించారు. శైవ, స్కంధ, లింగ పురాణాల ప్రకారం బ్రహ్మ శివానుగ్రహంతో కైలాసం నుంచి శ్రీకాళహస్తీశ్వర విగ్రహాన్ని తెచ్చారని, అందువల్ల ఈ కొండకు కైలాసగిరి అని పేరు వచ్చిందంటారు. అర్జునుడు తన తీర్థయాత్రలో ఈ స్థలాన్ని దర్శించి కైలాస నాథీశ్వరున్ని పూజించారు. భరద్వాజ మహర్షి ఇక్కడే తపస్సు చేసి స్వర్ణముఖి నది పవిత్రతను వివరించారని పురాణ కథనం. కైలాసగిరికి దిగువన ఉన్న ఆలయాన్ని మొదట పల్లవరాజులు, తరువాత తొండమాన్ చక్రవర్తి నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. చోళులు ప్రధాన ఆలయాన్ని పునరుద్ధరించారు. 11వ శతాబ్దంలో కుళోత్తుంగ చోళుడు గాలిగోపురాన్ని కట్టించారు. నారాయణవనాన్ని పరిపాలించిన వీరనరసింహ యాదవరాయుడు 12వ శతాబ్దంలో బయటి ప్రాకారాన్ని, ఆలయం నాలుగు మార్గాలను కలుపుతూ నాలుగు గోపురాలను నిర్మించారు. ఆ కాలంలోనే స్వర్ణముఖినదిపైన ఆనకట్ట నిర్మించారు. 1516లో శ్రీకృష్ణదేవరాయలు నూరు స్తంభాల మండపాన్ని, మరో భారీ గాలిగోపురాన్ని కట్టించారు.1529లో అచ్యుతరాయలు శ్రీకాళహస్తిలో పట్టాభిషేకం చేయించుకున్నాడు. 1912లో నట్టుకోట చెట్టియార్లు రూ.9 లక్షలు వెచ్చించి ఆలయం తుది మెరుగులు దిద్దారు. శ్రీకాళహస్తీశ్వరుడిని దర్శించుకున్న వారికి సకలపాపాలు తొలగి, అష్టైశ్వరాలు సిద్ధిస్తాయని భక్తుల నమ్మకం.



శ్రీకాళహస్తి పట్టణం వ్యూ



శ్రీ- కాళ-హస్తి విగ్రహాలు



స్వామి అమ్మవారు





విద్యుద్దీపాలంకరణలో భిక్షాలగోపురం, స్వర్ణముఖిలో విద్యుద్దీపాల వెలుగులు

క్లుప్తంగా

కిట్లు అందజేత



కిట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

పిచ్చాటూరు: నాగలాపురం సచివాలయం వద్ద మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ అపరంజిరాజు, సచివాలయ కన్వీనర్ మోహన్ మొదలియార్ సమక్షంలో ఆదివారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం స్టిక్కర్ కిట్లను సచివాలయ కన్వీనర్లకు అందజేశారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ మాట్లాడుతూ పార్టీ కేంద్ర కార్యాలయం అందించిన మా నమ్మకం నువ్వే జగన్ కిట్లను మండలంలోని సచివాలయ కన్వీనర్లకు అందజేసే ప్రక్రియ పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు చిన్నదొరై, ఎస్ఎం సురేష్, దేశప్పన్, విజయ్‌కుమార్, దేశన్, ముత్తు తదితరులు పాల్గొన్నారు.

అంకమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజ చేస్తున్న గున్నేరి కిషోర్‌రెడ్డి, గ్రామస్తులు

ఏర్పేడు: మండలంలోని నచ్చనేరిలో ఆదివారం అంకమ్మ ఆలయానికి భూమిపూజ చేశారు. ఇటీవల గ్రామస్తులు అంకమ్మ ఆలయాన్ని నిర్మించాలని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి విన్నవించారు. ఎమ్మెల్యే చొరవ తీసుకుని టీటీడీ నుంచి రూ.10 లక్షలు నిధులు మంజూరు చేయించారు. దీంతో ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి గున్నేరి కిషోర్‌రెడ్డి సర్పంచ్ మునిరామయ్య, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాళెం శివయ్య, నాయకులు పత్రా సిద్దయ్య, రామచంద్రారెడ్డి, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా రోడ్ల మరమ్మతు



ఏర్పేడు: మండలంలోని గుడిమల్లం పరశురామేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించే కొండచుట్టు తిరునాళ్ల కోసం పలు గ్రామాల్లో చేపట్టిన రోడ్ల మరమ్మతు పనులు శరవేగంగా సాగుతున్నాయి. గుడిమల్లం నుంచి కొండచుట్టు ఉత్సవం పెనుమల్లం, పెన్నగడం, పాపానాయుడుపేట, మర్రిమంద, విక్రుతమాల, ఎండీపుత్తూరు, రాజులకండ్రిగ, కుక్కలగుంట, పాయిల్‌సెంటర్ మీదుగా సాగనుంది. ఈ నేపథ్యంలో గుంతలమయంగా ఉన్న రోడ్ల మరమ్మతు పనులు చేస్తున్నారు.

బాంబ్ స్క్వాడ్ తనిఖీలు



తనిఖీ చేస్తున్న బాంబ్‌స్క్వాడ్

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 13వ తేదీ నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం బాంబ్‌స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ తనిఖీ చేపట్టారు. ఆలయంలో నాలుగు గోపురాలు, కైలాసం సెట్టింగ్, ధూర్జటి కళాప్రాంగణం, ఆలయ పరిసరాల్లో తనిఖీ చేశారు.


చదువుతోనే ఉన్నత స్థితి



మాట్లాడుతున్న భాస్కర్‌రెడ్డి

బుచ్చినాయుడుకండ్రిగ: సమాజంలో పేదరికాన్ని దూరం చేసి, ఉన్నత స్థితిని సాధించాలంటే చదువు ఒకటే మార్గమని జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల్లో వెంకటగిరి, నాగలాపురం, పిచ్చాటూరు, సత్యవేడు, వరదయ్యపాళెం, తొట్టంబేడు, బుచ్చినాయుడుకండ్రిగ మండలాల్లోని బీసీ హాస్టళ్లలో పదో తరగతి చదువుతున్న 143 మంది విద్యార్థులకు ప్రేరణ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఏబీసీడబ్ల్యూఓ చంద్రశేఖర్, వార్డన్ రామయ్య, విజయలక్ష్మి, శ్రీలక్ష్మి, అనురాధ, అన్నపూర్ణ, గంగాధర్ పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న ఎస్ఐ విజయకుమార్ తదితరులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని నగరివీధిలో ఉన్న హెల్పింగ్‌హ్యాండ్స్ సంస్థ వారు ఆదివారం దివ్యాంగులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి శ్రీకాళహస్తి ట్రాఫిక్ ఎస్ఐ విజయకుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ట్రాఫిక్ ఏఎస్ఐ రియాజ్, సభ్యులు గరికపాటి రమేష్‌బాబు, కోళ్లూరు హరినాయుడు, బాబా ఫరీద్, ఢిల్లీ కుమార్ పాల్గొన్నారు.

దేవదాయశాఖ మంత్రికి ఆహ్వానపత్రిక



మంత్రికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఈఓ సాగర్‌బాబు



ఉభయ కర్తలను ఆహ్వానిస్తున్న పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 13వ తేదీ నుంచి జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాలకు రాష్ట్ర దేవదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణను ఆదివారం ఈఓ సాగర్‌బాబు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆలయాధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉభయకర్తలకు ఆహ్వానం

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 13 నుంచి 26వ తేదీ వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉభయకర్తలను పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆహ్వానించారు. వాహన సేవలకు ఒక్కొక్క సేవకు ఒక్కొక్కరు శాశ్వత ఉభయకర్తలుగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో వీరికి ఆహ్వాన పత్రికలు అందజేసి, ఆహ్వానించారు. ఉభయకర్తలు సుబ్బారావు, గాజుల సత్యనారాయణ, కైకాల వారి సంఘం ప్రతినిధులు మధు, దయానందం గుప్త, రాముగుప్త, బోయ సామాజిక వర్గం ఉభయకర్తలను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, ఆలయ అధికారులు నాగభూషణం, వైఎస్సార్ సీపీ నాయకులు కొండూరు నంద, భాస్కర్ ముదిరాజ్, బాలా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తకండ్రిగలో ఉచిత వైద్యశిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని కొత్తకండ్రిగలో ఆదివారం ఎంజీఎం ఆస్పత్రి, శ్రీకాళహస్తి ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచితవైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్యులు షుగర్, బీపీ, గుండె, ఊపిరితిత్తులు తదితర వ్యాధులకు సంబంధించిన రోగులకు పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గెరటారెడ్డి, సర్పంచ్ శ్రీనివాసుల రెడ్డి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కామేష్, గౌరవాధ్యక్షుడు వీసీ వెంకటయ్య, సహాయకార్యదర్శి బత్తెయ్య, ఏపీఆర్వో హరిబాబు, ఎంజీఎం వైద్యులు దినేష్, జంబురాజన్, రూపేష్, దిలీప్, చరణ్ పాల్గొన్నారు.

లోకేష్ పాదయాత్ర అట్టర్ ప్లాప్

రేణిగుంట: టీడీపీ నాయకుడు, చంద్రబాబునాయుడు తనయుడు నారా లోకేష్ చేపట్టిన పాదయాత్ర అట్టర్ ప్లాప్ అయినట్లు రాష్ట్ర ప్రజలకు తెలిసిపోయిందని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. రేణిగుంట మండలం గాజులమండ్యంలో ఓ కార్యక్రమానికి హాజరైన ఆయన అనంతరం మీడియాతో మాట్లాడారు. నారా లోకేష్ పాదయాత్రకు జనం, టీడీపీ కార్యకర్తలు ముఖం చాటేశారన్నారు. అతను దేనికోసం పాదయాత్ర చేస్తున్నాడో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. పాదయాత్ర అట్టర్ ప్లాప్ కావడంతో నారా లోకేష్ చంద్రబాబు నాయుడు చేతిలో తిట్లు తింటున్నాడని ఎద్దేవా చేశారు. టీడీపీ అభ్యర్థులకు ఈ సారి డిపాజిట్లు కూడా రావని ఎమ్మెల్యే జోస్యం చెప్పారు. జగనన్న పాదయాత్రలో ఎన్ని అవాంతరాలు ఎదురైనా మొక్కవోని దీక్షతో ప్రజా సంకల్ప యాత్రను చేపట్టారన్నారు. పాదయాత్రలో జగనన్న ఇచ్చిన హామీలే మ్యానిఫెస్టోలో పెట్టి తూ.చ. తప్పక అమలు చేస్తున్నారని అన్నారు. జగనన్నను విమర్శించే స్థాయి నారా లోకేష్‌కు లేదన్నారు. 2024 ఎన్నికల తర్వాత టీడీపీ శాశ్వతంగా క్లోస్ అవుతుందన్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



శివగిరిలో ఆదెమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

పిచ్చాటూరు: మండలంలో మరణించిన ముగ్గురి కుటుంబాలను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆదివారం పరామర్శించారు. ఉదయం 9 గంటలకు మండలంలోని రజానగరం దళితవాడకు ఎమ్మెల్యే చేరుకుని వైఎస్సార్ సీపీ కార్యకర్త చంద్రబాబు తల్లి మణియమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అక్కడ నుంచి శివగిరి వెళ్లి సర్పంచ్ వరలక్ష్మి అత్తగారు ఆదెమ్మ చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించి సర్పంచ్ భర్త మోహన్ నాయుడు, కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మండలంలోని అడవికొడియంబేడు గ్రామానికి చేరుకుని వైఎస్సార్ సీపీ కార్యకర్త మురుగన్ తల్లి మునెమ్మ చిత్రపటానికి నివాళి అర్పించారు. మురుగన్ కుటుంబానికి తన సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కేటీ హరిశ్చంద్రరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, జెడ్పీటీసీ సభ్యురాలు విష్ణుప్రియ, సచివాలయ మండల కన్వీనర్ తొప్పయ్య, సర్పంచ్ కేజీ రోస్ రెడ్డి, అన్నాదురై, ఎంపీటీసీ సభ్యులు రమేష్ రాజు, ట్రేడ్ యూనియన్ మండల అధ్యక్షులు మునిరాజ, నాయకులు చలపతిరాజు, మోహన్, కిరణ్‌కుమార్, బాబురెడ్డి, చెంగల్రాయ రెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా వరి కోతలు



కల్లివెట్టులో వరి కోత కోస్తున్న యంత్రం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కనమనంబేడు, పల్లమాల, నెలవాయి, కల్లివెట్టు, తలారివెట్టు, వేణుగోపాలపురం గ్రామాల్లోని రైతులు జోరుగా వరికోతలు కోస్తున్నారు. ఈ గ్రామాల్లో రబీలో రైతులు 1,850 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. పంటను ముందుగా సాగు చేయడంతో కోతలు తొందరగా కోస్తున్నారు. ఈ ఏడాది ఎకరాలకు 40 బస్తాలు దిగుబడి వస్తుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వరి ధాన్యానికి మార్కెట్‌లో ధర బాగా ఉండడంతో ఎకర పంటలకు అన్ని ఖర్చులు పోను రూ. 25 వేలు మిగులుతుందని రైతులు అంటున్నారు.

శివానంద ధామం ప్రారంభం



శివానంద ధామం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, వ్యాసాశ్రమ పీఠాధిపతి పరిపూర్ణానందగిరి స్వామి



దాత జువ్వల మోహన్‌రామిరెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, తదితరులు

రేణిగుంట: మండలంలోని గాజులమండ్యంలో 'శివానంద ధామం' పేరుతో నిర్మించిన శ్మశాన వాటికను ఆదివారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ప్రారంభించారు. అమెరికాలో స్థిరపడిన గాజులమండ్యం వాసి జువ్వల మోహన్‌రామిరెడ్డి రూ.1.5కోట్ల వ్యయంతో శివానంద ధామం పేరుతో అధునాతన శ్మశాన వాటికలో నిర్మించిన 15 అడుగుల పరమశివుని విగ్రహాన్ని ఏర్పేడు శ్రీ వ్యాసాశ్రమ పీఠాధిపతి సద్గురు పరిపూర్ణానందగిరి స్వామి ఆవిష్కరించారు. గ్రామానికి చెందిన యువకులు బైక్‌ర్యాలీ చేశారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ చివరి మజిలీ సుఖమయం చేసేందుకు పుట్టిన ఊరి ప్రజలకు సేవ చేయాలన్న సంకల్పంతో ఇంతటి మహోన్నత కార్యక్రమాన్ని పూర్తి చేసిన జువ్వల మోహన్‌రామిరెడ్డి సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. శ్రీకాళహస్తిలో తాను కూడా రూ.35 కోట్లు వ్యయంతో దక్షిణ కైలాస ముక్తిధామాన్ని నిర్మిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. వ్యాసాశ్రమ పీఠాధిపతి పరిపూర్ణానందగిరి స్వామి మాట్లాడుతూ శివానంద ధామం పేరుతో ఎంతో సుందరంగా శ్మశాన వాటికను తీర్చిదిద్దడం ఎంతో అభినందనీయమన్నారు. పరులకు హితాన్ని కాంక్షించడం, చేసే పుణ్య కార్యాలు లోకకల్యాణానికి దోహదపడుతాయన్నారు. ప్రతిఒక్కరూ సేవాగుణాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. గాజులమండ్యం గ్రామానికి పూర్వ నామం 'మహర్షి మాండవ్యపురం' గా మార్చేందుకు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని ఆయన గ్రామస్తుల తరఫున కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ కచ్చితంగా ప్రాచీన ప్రాశస్త్యం కలిగిన పేరును గ్రామానికి పెట్టేందుకు అధికారులతో మాట్లాడుతానన్నారు. అభివృద్ధి చేసిన శ్మశాన వాటిక నిర్వహణ బాధ్యతను పంచాయతీకి అప్పగిస్తూ సర్పంచ్ గంగారి రమేష్‌కు తాళాలను అందజేశారు. అనంతరం శివానంద ధామం ప్రదాత మోహన్‌రామిరెడ్డిని పలువురు ప్రముఖులు ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఈఎంసీ సీఈఓ గౌతమి, మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి, ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు సంధ్య, సర్పంచ్ గంగారి రమేష్, ఎంపీటీసీ సభ్యుడు జువ్వల ధనంజయరెడ్డి, వ్యాసాశ్రమ మేనేజర్ మన్యం అమరనాథరెడ్డి, జువ్వల దయాకర్‌రెడ్డి, పన్నీరుకాల్వ శ్రీధర్‌రెడ్డి, మల్లవరం నరేంద్రరెడ్డి, డాక్టర్ కృష్ణప్రశాంతి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమావేశాలకు పోలీసుల అనుమతి తప్పనిసరి

పిచ్చాటూరు: మండలంలో సభలు, సమావేశాలు నిర్వహించడానికి పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని స్థానిక ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో ఈ నెల ఒకటి నుంచి 28 వరకు సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ 1961 అమలులో ఉందన్నారు. ఈ నేపథ్యంలో ర్యాలీలు, ధర్నాలు, సభలు, బహిరంగ సమావేశాలు నిర్వహించడానికి పోలీసుల అనుమతి తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు.

వరదయ్యపాళెంలో ట్రాఫిక్.. ట్రాఫిక్



పోలీస్ స్టేషన్ మలుపు వద్ద స్తంభించిన ట్రాఫిక్ దృశ్యం



పూల దుకాణాల మలుపు వద్ద బారులు తీరిన వాహనాలు

వరదయ్యపాళెం: శ్రీకాళహస్తి–తడ మార్గంలోని వరదయ్యపాళెంలో నిత్యం ట్రాఫిక్ స్తంభిస్తోంది. రోజురోజుకు అటు శ్రీసిటీ పారిశ్రామిక వాడకు వెళ్లే వాహనాలు, ఇటు కల్కి వన్నెస్ ఆలయానికి వెళ్లే వాహనాలతో రద్దీ పెరుగుతోంది. దీని కారణంగా వరదయ్యపాళెం మండల కేంద్రంలో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు వాహనచోదకులకు తలనొప్పిగా మారుతోంది. ప్రధానంగా వరదయ్యపాళెం పోలీస్ స్టేషన్ మలుపు వద్ద ప్రతి అరగంటకోసారి ట్రాఫిక్ స్తంభిస్తోంది. శ్రీసిటీలో ఏర్పాటవుతున్న పరిశ్రమలకు సంబంధించి నిర్మాణ పనులకు మెటీరియల్ తరలింపు, ఇప్పటికే ఉత్పత్తులు ప్రారంభించిన పరిశ్రమలకు సంబంధించిన వాహనాలు పెద్ద సంఖ్యలో రోజువారీ ఈ మార్గం గుండా వెళ్తున్నాయి. ఇటీవల ప్రారంభమైన కల్కి వన్నెస్ ఆలయం సందర్శనకు రోజువారీ వందలాదిగా భక్తుల వాహనాలు ఇటువైపుగా వెళ్తున్నాయి. ఈ మార్గ మధ్యంలోని వరదయ్యపాళెంలో రోడ్ల విస్తరణకు నోచుకోకపోవడంతో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ప్రతి అర గంటకు ఓసారి ట్రాఫిక్ స్తంభిస్తూ రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. ఈ సమస్యపై రోజువారీ అటు స్థానికులు, ఇటు వాహనదారులు అసహనానికి గురవుతున్నారు. పోలీసులు స్పందించి ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ



రేణిగుంట: స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేస్తున్న అడిషనల్ ఎస్పీ విమలకుమారి, ఆర్డీఓ రామారావు



శ్రీకాళహస్తి: అన్నదాన సిబ్బందికి దుస్తులు అందజేస్తున్న దాతలు

రేణిగుంట: సిర్స్ సంస్థ సీఆర్ఎస్ సమీపంలోని శబరి ఆశ్రమంలో ఆదివారం బ్యాక్ టు స్కూల్ కార్యక్రమం ద్వారా పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. అడిషనల్ ఎస్పీ విమలకుమారి, శ్రీకాళహస్తి ఆర్డీఓ రామారావు చేతుల మీదుగా 135 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్పులను అందజేశారు. కుటుంబ ఆర్థిక స్థితిగతులు సరిగా లేనప్పుడు విద్యకు దూరమై ఎంతో మంది పిల్లలు సామాజికంగా, ఆర్థికంగా వెనుకబాటుతనానికి గురవుతున్నారని వారు తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు వారికి తోడ్పాటునందిస్తాయన్నారు. ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా రూ.24 లక్షలు స్కాలర్‌షిప్‌ల రూపంలో పేద విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం అందించినట్లు సంస్థ కార్యదర్శి శేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రొఫెసర్ విజయలక్ష్మి, స్వామక్స్ సీఈఓ సంగీతం విశ్వనాథ్, మాస్ సంస్థ అధ్యక్షుడు జ్ఞానశేఖర్‌రెడ్డి, కార్యదర్శి రాజేష్, శ్రీనివాసులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన సత్రం సిబ్బందికి దుస్తులు..

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 13వ తేదీ నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. అందులోభాగంగా ఆలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన సిబ్బందికి ఆదివారం తిరువూరుకు చెందిన జయకుమార్, శ్రీనివాసులు, చెంచురత్నంయాదవ్ టీషర్టు, పంచెలు అందజేశారు. 46 మందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.